క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


భూమి పూజ చేస్తున్న దృశ్యం

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచల కిషోర్, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి పూజలు చేసి హారతి అందుకున్నారు. కార్యక్రమంలో ఉభయదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ


కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: మండలంలోని నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో 15 మంది విద్యార్థులకు సోమవారం ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. గుడిపాలన పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్య మాట్లాడుతూ, దృష్టి సంబంధిత సమస్యలు ఉన్న వారిని గుర్తించి అంధత్వ నివారణ సంస్థ విద్యార్థులకు కళ్లద్దాలను ఇస్తోందన్నారు. పిల్లలు సెల్‌ఫోన్లు ఎక్కువగా చూడరాదన్నారు. క్యారెట్, ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రజనీకాంత్, ఎంపీటీసీ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది జబసెల్వి, ఉమామహేశ్వరి, సరస్వతి, సుజిమ పాల్గొన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం


విద్యార్థులతో కలిసి సీసీరోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గుడిపాల: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నూతన సీసీరోడ్లు, కుప్పిగానిపల్లెలో సచివాలయ భవనాన్ని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం 11 గ్రామాల్లో రూ.1.44కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, రాబోవు రోజుల్లో వివిధ అభివృద్ధి పనులకు మండలంలో రూ.7కోట్లు వ్యయం చేయనున్నట్టు పేర్కొన్నారు. ఎంపీడీఓ శివరాజన్, తహసీల్దార్ జయంతి, డీఈలు నవీన్‌కుమార్, ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, జనసేన, టీడీపీ నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

గుడిపాల: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సీసీ రోడ్లకు ప్రారంభోత్సవం, చిత్తపారలో గ్రామ సచివాలయం, పిళ్లారికుప్పంలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తారని ఎంపీడీఓ శివరాజన్ తెలిపారు.

సమాజంలో పాత్రికేయులది కీలకపాత్ర


డైరీలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

చిత్తూరు కలెక్టరేట్ : సమాజంలో పాత్రికేయులది కీలకపాత్ర అని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో ఏపీయూడబ్ల్యూజే డైరీలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి–ప్రజలకు నడుమ జర్నలిస్టుల సేవలు ఎనలేనివన్నారు. క్షేత్రస్థాయిలో జర్నలిస్టులకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం పలు అంశాలపై జర్నలిస్టులతో చర్చించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్‌ఓ మోహన్‌కుమార్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోకనాథన్, మురళీకృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అశోక్‌కుమార్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు పవన్, శివప్రసాద్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

గొల్లపల్లెలో జాతర



పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ గొల్లపల్లెలో ఆరిమాను గంగమ్మ జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి అమ్మవారి శిరస్సు మెరవణి, సోమవారం అమ్మవారి సర్వదర్శనంతో జాతర సాగింది. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు పొంగళ్లు మోసి అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు.

జిల్లాలో వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమపైనే ఎక్కువమంది ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్నారు. పొలంలేని వారు, ఉపాధి లేని వారు గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రధానంగా పాడిఆవుల పోషణపైనే ఆధారపడ్డారు. అయితే ఈ ఏడాది గడ్డిధరలు విపరీతంగా పెరగడంతో వారంతా విలవిలలాడుతున్నారు. పశుగ్రాసం కొరతతో మండలంలోని పాడిపరిశ్రమ కుదేలవుతోంది.


గుడిపాలలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎండుగడ్డి

గడ్డికి గడ్డు కాలం..!

- మోపు గడ్డిధర రూ.250 నుంచి రూ.270
- పశుపోషకులకు అందుబాటులో లేని గ్రాసం
- పేరుకే పశుగ్రాస క్షేత్రాలు
- పశుపోషకులకు వర్తించని వైనం
- కుదేలవుతున్న పాడిపరిశ్రమ
- ఆదుకోని కూటమి ప్రభుత్వం

గుడిపాల: మండలంలో 16,500 ఆవులు, దూడలు ఉన్నాయి. వీటికి ఏడాదికి సరిపడా వరి గడ్డి నిల్వ చేసుకోవాలంటే ఒక్కో ఆవుకు 150 మోపుల చొప్పున గడ్డి కావాలి. ఈ ఏడాది పంటలు పండినప్పటికీ గడ్డిమోపు ధర రూ.250 నుంచి రూ.270 వరకూ పలుకుతోంది. దీంతో కొంతమంది పశుపోషకులు గడ్డి కొనుగోలు చేయలేక ఆవులను విక్రయిస్తున్నారు.

పశుపోషక క్షేత్రాలు పథకమేదీ?

ప్రభుత్వ పశుపోషక క్షేత్రాలు ఉన్నప్పటికీ రైతులకు ఉపయోగపడటం లేదు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవన్నీ మాటలకే పరిమితం అయ్యాయి. ప్రభుత్వమే రైతుల వద్ద గడ్డి కొనుగోలు చేసి పశుపోషకులకు ఇస్తే ఉపయోగకరంగా ఉంటుందని పలువురు రైతులు కోరుతున్నా ఆ దిశగా చర్యలు తీసుకునేవారు కరువయ్యారు. గుడిపాలలో పశుపోషక క్షేత్రాలకు సంబంధించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారేగానీ ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉంటోంది. అధికారులు మాత్రం ఏప్రిల్ నుంచి అమలులోకి వస్తుందని చెబుతున్నారు.

మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కానీ ఒక్కో పంచాయతీలో కేవలం మూడు ఎకరాలకు మాత్రమే పశుగ్రాస క్షేత్రాలకు అనుమతులు ఇస్తామని చెబుతున్నట్లు సమాచారం. ఇలాగైతే మిగతా పాడిరైతుల పరిస్థితి ఏమిటనే ప్రశ్నకు సమాధానం లేదు.

గడ్డి ధర పెరగడంతో పశువులను తగ్గించుకున్నా

నాకు సెంటు భూమి కూడా లేదు. పశువులపైనే ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నా. ఇంతకుముందు నాకు 5 ఆవులు ఉండేవి. గడ్డి మోపు రేటు రూ.250 నుంచి రూ.270 పెరగడంతో మూడు ఆవులు అమ్మేశాను. గడ్డి ధర పెరగడం వలను మాకు వచ్చే ఆదాయం ఆ గడ్డికే సరిపోతోంది. ప్రభుత్వం మాకు ఎలాంటి పథకాలు ఇవ్వడం లేదు. పశుగ్రాసం గురించి ప్రభుత్వం ఆలోచించాలి. రైతుల దగ్గర కొనుగోలు చేసి ఇవ్వాలి.

– ఆర్ముగం, గుడిపాల

ప్రభుత్వమే పశుగ్రాసం ఇవ్వాలి

ప్రభుత్వం పశుగ్రాస క్షేత్రాలు పెట్టిందేగానీ ఒక్క రైతుకూ ఉపయోగపడటం లేదు. ఒక్కరికి కూడా ఈ పథకం వర్తించడం లేదు. పొలం ఉంటే బోర్లు ఉండవు. ఆవులు ఉంటే పొలం ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ పథకం దేనికీ ఉపయోగపడటం లేదు. ప్రభుత్వ పశుగ్రాసం కొనుగోలు చేసి మాలాంటి వాళ్లకు ఇవ్వాలని కోరుతున్నాం.

– శ్రీనివాసులు, గుడిపాల

పశుపోషక క్షేత్రాలకు సబ్సిడీ

పశుపోషక క్షేత్రాలు ఏర్పాటు చేసుకోవడానికి రైతులకు అవకాశం ఉంది. అయితే పొలం ఉండి బోర్లుగానీ బావులుగానీ తప్పనిసరిగా ఉండాలి. అలా ఉన్నవారు పశుపోషక క్షేత్రాల ఏర్పాటుకు ముందుకు వస్తే జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద కొంత మేరకు సబ్సిడీ వస్తుంది. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– సాయిసుధ, పశువైద్యాధికారి, గుడిపాల

అడవికి నిప్పు మానవాళికి ముప్పు


అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

గుడిపాల: అడవికి నిప్పు పెట్టడం మానవాళికి ముప్పు అని బొమ్మసముద్రం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అడవికి నిప్పుపెట్టడం వలన కలిగే నష్టంపై సోమవారం బొమ్మసముద్రం, కోటూరు గ్రామాల్లో ప్రజలకు అటవీ అధికారులు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, చాలామంది అటవీప్రాంతం పక్కన నిప్పు పెడుతున్నారని, ఇలా నిప్పు పెట్టినట్లయితే ఏపీ ఫారెస్ట్ యాక్ట్ 1967 ప్రకారం శిక్షార్హులవుతారన్నారు. అడవుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిప్పు పెట్టి, అటవీ సంపదను బుగ్గి చేయరాదని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారులు ఉష, మధు పాల్గొన్నారు.

విద్యుత్ గ్రీవెన్స్ రేపు

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. స్థానిక గాంధీరోడ్డులోని తమ కార్యాలయంలో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలోని వినియోగదారులు తమ దృష్టికి సమస్యలు వినతి పత్రాల రూపంలో నివేదించవచ్చని తెలియజేశారు.

మునిసిపల్ గ్రీవెన్స్‌పై నిర్లక్ష్యం వద్దు

–కమిషనర్ నరసింహ ప్రసాద్


వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో ప్రజల నుంచి అందే వినతులను పరిష్కరించే విషయంలో నిర్లక్ష్యం వహించరాదని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి అందే వినతులు, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్థిక అంశాలతో ముడిపడ్డ వాటిని ప్రాధాన్యత ఆధారంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, మునిసిపల్ ఇంజనీర్ వెంకటరామిరెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించండి


విద్యార్థుల వడ్డించే భోజనాన్ని పరిశీలిస్తున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి అన్నారు. సోమవారం స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలురు, బాలికల వసతి గృహాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. మౌలిక వసతులు, సమస్యలపై ఆరా తీశారు. వసతి గృహాల విద్యార్థుల సంక్షేమానికి సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు చదువులో రాణించేలా మంచి వాతావరణం కల్పించాలని, విద్యార్థులకు సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హాస్టళ్ల సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ముఖ్యం

– జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్


సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

తవణంపల్లె: గ్రామీణ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి బి. వేణుగోపాల్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం తవణంపల్లె పీహెచ్‌సీలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైనా జ్వరపీడితులు ఉన్నారా, లేదా? అని ఆరా తీశారు. డెంగీ, మలేరియా, చికున్ గున్యా, ఫైలేరియా జ్వరాలపై గ్రామీణులకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలన్నారు. పల్లెల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం విధిగా డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు మలేరియా అధికారి రామచంద్రారెడ్డి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శివసుబ్రమణ్యం, సూపర్‌వైజర్ నారాయణ, తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కరెంటు చార్జీల భారం వద్దు

–విద్యుత్ వినియోగదారుల సంఘం కరపత్ర ప్రచారం


వినియోగదారులకు కరపత్రాలను ఇస్తున్న చైతన్య

చిత్తూరు కార్పొరేషన్: ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని విద్యుత్ వినియోగదారుల సంఘం నాయకులు చైతన్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక దర్గా సర్కిల్ వద్ద ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. గతంలో కొనుగోలు చేసిన విద్యుత్‌కు ఇప్పుడు భారం వేయడం సరికాదన్నారు. ట్రూఅప్ చార్జీల అమలును రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ అనుమతి ఇవ్వడం ప్రజావేదిక నిర్ణయమన్నారు. కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీల రూపేణా ప్రజలపై భారం వేయడం అన్యాయమని నిరసించారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్రనాథ్, ఇక్బాల్, మౌలా, బషీర్ పాల్గొన్నారు.

25న వాహనాల వేలం

పుంగనూరు: పుంగనూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 25న ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు సీఐ సురేష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేలంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరావత్తు చెల్లించి, స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి


సీడీపీఓకి సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బంగారుపాళెం: అంగన్‌వాడీ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలంటూ సోమవారం కార్యకర్తలు, హెల్పర్లు సీడీపీఓకు వినతి పత్రం ఇచ్చారు. యూనియన్ నాయకురాళ్లు లక్ష్మి, రాధిక, రత్నకుమారి, విమల, భారతి మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల న్యాయమైన సమస్యను ప్రభుత్వం పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. వేతనంతో కూడిన మెడికల్ సెలవు, కనీస వేతనాలు మంజూరు చేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వం సంక్షేమ పథకాలను అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రీ స్కూల్లో చదువుకుంటున్న పిల్లలకు తల్లికివందనం పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఐదేళ్లలోపు పిల్లలు విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చదివేలా జీఓ జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


మాట్లాడుతున్న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి

చిత్తూరు కలెక్టరేట్ : ఆడపిల్లల రక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి అన్నారు. ఆడపిల్లల ఆత్మరక్షణ అంశంపై సోమవారం సంజయ్‌గాంధీ నగర్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, బాలికలు చిన్నతనం నుంచే శారీరక, మానసిక దృఢత్వంతో ముందుకుపోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే భయపడకుండా వాటిని ఆత్మస్థయిర్యంతో ఎలా ఎదుర్కోవాలో అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా మైనారిటీ కార్పొరేషన్ ఈడీ హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ, అమ్మాయిలు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రూపేష్ సొసైటీ ఎండీ బాబు, ప్రిన్సిపల్ రేఖ తదితరులు పాల్గొన్నారు.

పానాటూరులో 'ఫ్యామిలీ డాక్టర్'


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: మండలంలోని పానాటూరు సచివాలయంలో సోమవారం బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. బీపీ, మధుమేహం, ఇతర రుగ్మతలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. మందులు, మాత్రలను అందజేశారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వైద్యసిబ్బంది ప్రియాంక, వీరలక్ష్మి, కలైవాణి, భారతి, సుజాత, ప్రవీణ్ పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలనూ పట్టించుకోరా?

పలమనేరు: ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని ఆ పార్టీ నేతల మాటతో మండలంలో అభివృద్ధికి ఆటంకం నెలకొందని దీనిపై తాము హైకోర్టును ఆశ్రయించామని కనీసం హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలైనా అమలు చేయాలంటూ మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు విశ్వనాథ రెడ్డితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు సోమవారం స్థానిక ఎంపీడీవో ఖాదర్‌బాషాకు విన్నవించారు.

కూటమి నేతల గుప్పెట్లో ఎంపీడీఓ

పారిశుధ్యం, తాగునీరు, బోరు మరమ్మతులకు సైతం కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులను ఖర్చు చేయడం లేదు. జెడ్పీ, మండల గ్రాంట్ల నిధులు ఉన్నా కూటమి నేతలు వీటిని ఖర్చుపెట్టనీయకుండా ఎంపీడీవోను గుప్పెట్లో పెట్టుకున్నారు. కట్టడి చేయడంతో మంజూరైన నిధులను సైతం వాడుకోలేని పరిస్థితి పలమనేరు మండలంలో నెలకొంది. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో కొందరు సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన హైకోర్టు ధర్మాసనం నిధులను విడుదల చేసి తీర్మానించిన పనులను చేపట్టాలని ఇటీవల ఆదేశించింది.

ఇంతకూ ఏమి జరిగిందంటే: ఆయా మండలాల్లో ఇప్పటికే మంజూరైన మండల, జెడ్పీ నిధులను సైతం కూటమి నేతల ఓవరాక్షన్‌కు మగ్గుతున్నాయి. పలమనేరు మండలంలో జగమర్లకు మంచినీటి సరఫరా, కురప్పల్లిలో సీసీ రోడ్డు, బయ్యప్పగారిపల్లిలో పైపులైను ఏర్పాటు. ఇందుకోసం రూ.55 లక్షల నిధులు మంజూరయ్యాయి. అయితే కూటమి నేతల ఒత్తిళ్లతో పలమనేరు ఎంపీడీవో ఖాదర్‌బాషా ఈ పనులకు ఆమోదం తెలపలేదు. దీంతో ప్రజాప్రతినిధులు జిల్లా కలెక్టర్ సైతం ఫిర్యాదు చేసినా ఉపయోగం లేదు.

హైకోర్టును ఆశ్రయించిన వైనం: దీనిపై మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు, మొరం సర్పంచ్ విశ్వనాథ రెడ్డి పీఆర్ అండ్ ఆర్‌డీ ఉన్నతాధికారులతోపాటు ఎంపీడీవోలపై హైకోర్టులో రిట్‌పిటిషన్(18/2025)ను దాఖలు చేశారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ధీరజ్‌సింగ్ టాకూర్, జస్టిస్ రవి చీమలపాటి ఈ నెల 5న తీర్పును వెలువరించారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరాన్ని గుర్తిస్తూ పెండింగ్‌లోని నిధులను నెలరోజుల్లో ఖర్చు చేసి అక్కడి మండల సభ తీర్మానించిన పనులు చేయాలని తీర్పులో ఆదేశించారు.

కార్పొరేషన్ రుణం.. టీడీపీ బేరం!

కార్పొరేషన్ రుణం మంజూరు చేయాలంటే ఆ దరఖాస్తులో టీడీపీ నాయకులు ఐదుగురు సంతకాలు చేయాలి. లేదంటే ఆ దరఖాస్తు చెల్లుబాటు కాదు. దీంతో రుణం కోసం వెళ్లిన దరఖాస్తుదారులతో అధికార పార్టీ నాయకులు బేరాలాడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 'రుణం ఎంత కావాలి.. మాకెంత ఇస్తావు?' అంటూ ప్రశ్నించడంతో కొందరు నిరాశతో వెనుదిరుగుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే దరఖాస్తులు వేలల్లో వస్తున్నా, రుణాలు మాత్రం వందల్లో కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మాత్రం రుణాల మంజూరుపై కాకి లెక్కలు చెబుతోంది.


రుణం కోసం మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేస్తున్న బీసీలు

- దరఖాస్తులో ఐదుగురి నాయకుల సంతకాలు తప్పనిసరి
- రుణం కోసం టీడీపీ నేతల చుట్టూ ప్రదక్షిణలు
- వేలల్లో దరఖాస్తులు.. వందల్లో మంజూరు

కుప్పం: రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ రుణాల పేరిట ప్రజలకు కాకిలెక్కలు చెబుతూ నిలువునా మోసం చేస్తోంది. నియోజకవర్గానికి మంజూరు చేసింది వందల్లో రుణాలైతే.. దరఖాస్తులు మాత్రం వేలల్లో ఉన్నాయి. రుణం కావాలంటే పంచాయతీలో కీలకంగా పనిచేసే టీడీపీ నాయకుల ఐదుగురి సంతకాలు తప్పనిసరి. ఈ తతంగంతో యువతకు కార్పొరేషన్ రుణాలపై ఆశలు ఆవిరవుతున్నాయి.

రుణం కావాలంటే అవి తప్పనిసరి

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, కాపు కార్పొరేషన్ ద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు ఐదుగురి సంతకాలు దరఖాస్తు ఫారంలో తప్పనిసరిగా ఉంటేనే రుణాలు మంజూరు చేస్తారు. పంచాయతీ స్థాయిలో క్లస్టర్ ఇన్‌చార్జిలు, పంచాయతీ పార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, క్రియాశీలక కార్యకర్తలు ఐదు కేడర్లను టీడీపీ నియమించింది. ప్రభుత్వం నుంచి ఏ సంక్షేమ పథకమైనా లబ్ధిదారుడికి చేరాలంటే ఈ ఐదుగురి సంతకాలు తప్పనిసరి. దీంతోపాటు దరఖాస్తుదారుడు జననాయకుడి పేరిట టీడీపీ ముద్రించిన పసుపు అర్జీ ఫారంపైన తప్పనిసరిగా నమోదు చేయాలి. బ్యాక్‌గ్రౌండ్ చంద్రబాబు ఫొటో, పసుపురంగు పేజీ, సైకిల్ గుర్తులతో కూడిన దరఖాస్తు ఫారంపై నమోదు చేసి సంబంధిత ఐదుగురి సంతకాలు ఉంటేనే రుణం మంజూరవుతుందని స్పష్టం చేస్తున్నారు. ఈ దరఖాస్తు ఫారం కూడా ఆన్‌లైన్‌తో పని లేకుండా నేరుగా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జననాయకుడి విభాగంలో 8 మంది ప్రత్యేక సిబ్బంది ద్వారా అందజేస్తున్నారు. వీరి వద్దకు వచ్చి దరఖాస్తు నమోదు చేస్తేనే పరిగణనలోనికి తీసుకుంటారని టీడీపీ నాయకులు చెబుతున్నారు. దీంతో పేరుకు మాత్రమే కార్పొరేషన్ రుణాలు గానీ మొత్తం టీడీపీ నాయకుల వ్యవహారంలాగా సాగుతోంది.

కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు

కార్పొరేషన్ రుణాలు కుప్పం నియోజకవర్గానికి వందల్లో మంజూరయ్యాయి. కానీ నేరుగా జననాయకుడి అర్జీ కేంద్రం ద్వారా వేలల్లో దరఖాస్తులు అందాయి. కుప్పం నియోజకవర్గానికి 535 కాపు కార్పొరేషన్ల రుణాలను ప్రభుత్వం కేటాయించింది. కానీ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. టీడీపీ కార్యాలయంలో జన నాయకుడి విభాగంలోనే వేలల్లో దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఇక ఆన్‌లైన్ ద్వారా భారీగా దరఖాస్తులు నమోదైనట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కార్పొరేషన్ ద్వారా రుణాలు వస్తాయని పాడి పరిశ్రమలపైన అధిక ఆశచూపుతున్న యువ రైతులు, యువతకు రుణాలు నిరాశనే మిగుల్చుతున్నాయి.